www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబర్ 2022



పార్కింగ్ ఇక్కట్లు...!

- స్థలం లేక జిల్లా కేంద్రంలో సమస్య తీవ్రం
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిలిపి ఉన్న వాహనాలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా కేంద్రంలో వాహనాలు ఉపయోగించే వారి సంఖ్య రోజురోజుకు రద్దీ పెరుగుతోంది. పట్టణంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ద్విచక్ర వాహనాలు, కార్లలో పట్టణానికి వచ్చి పని చూసుకునేంత వరకు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని దుస్థితి జిల్లా కేంద్రంలో నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్య పరిష్కారం వైపు అడుగులు వేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మారుతున్న కాలాను గుణంగా వాహనాల వినియోగం రోజు రోజుకు విపరీతంగా పెరుగుతూ వస్తోంది. రహదారుల్లో వాహనాల ప్రయాణం జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ పెరగడంతో పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. వివిధ పనుల నిమిత్తం పలు ప్రాంతాల నుంచి వాహనాలలో పట్టణానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంలోని ప్రధాన వీధులలో ఎక్కడ చూసినా ద్విచక్ర వాహనాల పార్కింగ్ కనిపిస్తోంది. జిల్లా కేంద్రం రాయచోటిలో పనినిమిత్తం వెళ్లేవారు వారి వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ద్విచక్ర వాహనాలు, కార్లు రాయచోటి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్ స్టేషన్ ఆవరణం, తాహశీల్దార్ కార్యాలయం ఎదుట పెట్టేవారు. ప్రస్తుతం ఆర్‌టిసి బస్టాండ్ ప్లాట్ ఫామ్ పెంచడంతో మరమ్మతులు చేపడుతున్నారు. ఆస్పత్రిలో వంద పడకల ఆసుపత్రికి భవనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ చుట్ట ప్రక్కల ప్రభుత్వ ఆసుపత్రి, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి, సబ్ రిజిస్టర్, తహశీల్దార్, కోర్టు మున్సిపల్, మండల ప్రజా పరిషత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ వంటి పలు కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో వచ్చిన వాహనదారులు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక ఇబ్బంది గురవుతున్నారు. ప్రతి కార్యాలయంలో వద్ద 'నో పార్కింగ్' అని బోర్డును ఏర్పాటు చేశారు. ఒకవేళ తెలియక వాహనాలు నిలబెడితే పోలీసులు వాహనాలకు గాలి తీస్తున్నారు. అపరాధ రుసుం వేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో వాహనాల పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి

గతంలో వాహనాలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం జిల్లా కేంద్రం కావడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు ఎక్కువగా ఉన్నాయి. ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే పట్టణాలలో ఆర్‌టిసి బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఉంటుంది. కానీ రాయచోటి నుండి ఎక్కడికైనా వెళ్లాలంటే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక వాహనదారులు ఇబ్బందులు గురవుతున్నారు. చిన్న చిన్న పట్టణాలలో కూడా పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాయచోటి జిల్లా కేంద్రమైన ఇంత వరకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

- ఎం. రాజశేఖర్, వాహనదారుడు, రాయచోటి.

బండ్లకు ఫైన్లు వేస్తున్న పోలీసులు

పట్టణంలో పార్కింగ్ ప్లేస్‌లు లేకపోవడంతో బండ్లను ఎక్కడపడితే అక్కడ పెట్టాల్సి వస్తోంది. పోలీసులు బండ్లకు ఫైన్లు వేస్తున్నారు. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. లేకపోతే ఇబ్బందులు తప్పవు. అధికారులు వెంటనే స్పందించి రాయచోటి జిల్లా కేంద్రంలో పార్కింగ్ స్థలాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.

- రమణారెడ్డి, వాహనాదారుడు, రాయచోటి.

మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం

పట్టణంలో వాహనాలు పార్కింగ్ స్థలం కోసం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. అధికారులు స్థలం ఏర్పాట్లు చేసిన వెంటనే పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేవచకుండా లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- శ్రీధర్, డిఎస్‌పి, రాయచోటి.

ఉపాధ్యాయుల సర్దుబాటు తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి



డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇస్తాం, బదిలీలు చేస్తామని చెప్పిన పాలకులు, అధికారులు ఇప్పుడు ఉన్న వారిని అడ్డదిడ్డంగా సర్దుబాటు చేస్తామంటూ చర్యలు చేపట్టడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ పేర్కొన్నారు. సోమవారం యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా డిఇఒ కార్యా లయం ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ అనాలోచిత చర్యల కారణంగా ప్రభుత్వ విద్యా రంగం పూర్తిగా తిరోగమన దిశలోకి జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనకు అడ్డంకిగా ఉన్న యాప్లను రద్దు చేయకుండా జనగణన ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తొలగించడం ద్వారా విద్యార్థులకు ఎలా న్యాయం జరుగుతుందో ప్రభుత్వమే చెప్పాలన్నారు. వేలాదిగా ప్రమోషన్లు ఇస్తామని ఊరించి నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వకుండా పాఠశాలల మూసివేతకు చర్యలు చేపట్టడం ఉపాధ్యాయులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రమోషన్లు ఇచ్చినట్లే ఇచ్చి వారికి స్థానాలను కేటాయించకపోవడం ఉపాధ్యాయుల అసంతృప్తికి గురి చేసిందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఒక రకమైన మార్గదర్శకాలు ఇస్తే జిల్లా విద్యాశాఖ, కొంతమంది మండల విద్యాశాఖ అధికారులు తమకు అనుకూల విధానాలు అవలంభించడంతో ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పని సర్దుబాటు నిలుపుదల చేయాలని ప్రమోషన్లు ఇచ్చిన వారికి స్థానాలను కేటాయించాలని, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా కోశాధికారి అక్రం బాషా, జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పురం వెంకట రమణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనరు సురేంద్ర రెడ్డి, వివిధ మండలాల నాయకులు రఫీ, ఉమా శంకర్, అమీనుల్లా, హఫీజుల్లా, హరి, నాగరాజు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు త్వరితగతిన పంపిణీ చేయాలి : జెసి


సమావేశంలో మాట్లాడుతున్న జెసి తమీమ్ అన్సారీయా

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాలలో త్వరితగతిన భూహక్కు పత్రాలు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న భూహక్కు పత్రాల పంపిణీ, వాలంటీర్ల వేకెన్సీ, ఓటరు జాబితాకు సంబంధించిన పలు అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే పూర్తయిన 36 గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రాలు వచ్చాయని, భూహక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు ఆర్డీవోలు, తహశీల్దార్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సంప్రదించి వచ్చే గురువారం లోపల భూహక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ వాలంటీర్ల ఖాళీలున్నాయో ఆయా మండలాల ప్రజా ప్రతినిధిని సంప్రదించి వెంటనే భర్తీ చేయాలన్నారు. జిల్లాలో ఎక్కువగా మదనపల్లె 36, రాజంపేటలో 32 వాలంటరీ పోస్టులు ఖాళీలు ఉన్నా యన్నారు. ఇవన్నీ వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టా లన్నారు. ఆరోగ్యశ్రీ కార్డల రిజిస్ట్రేషన్ పెండింగ్ లేకుండా ఎప్పటి కప్పుడూ పూర్తి చేయాలని సూచిం చారు. రెవెన్యూ సర్వీసెస్ బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోకి వెళ్లకుండా ఎవరెవరి లాగిన్ లో దరఖాస్తులు ఉన్నాయో అవన్నీ వచ్చే సోమవారం లోపల పరిష్కరించాలన్నారు. మల్టీ పర్పస్ ఫెసిలిటీస్ గోడౌన్ల నిర్మాణాలకు సంబంధించి స్థలాలు గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు.నూతన ఓటరు జాబితా ప్రకారం ఓటర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా జిల్లాలోని అన్ని కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. తహ శీల్దార్లు, బిఎల్‌ఒలు ఓటు హక్కు గురించి, ఓటు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి అర్హులందరిని నమోదు చేయిం చాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనా రాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్, డిప్యూటీ తహశీల్దార్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్


ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - రాయచోటి

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ అండగా ఉంటుందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేవూరి వేణు గోపాల్ అన్నారు. సోమవారం సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని టిఎన్ఎస్ఎఫ్ రాజంపేట పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చలో కలెక్టరేట్ వెళ్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి తాలుకా స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వేణు గోపాల్ మాట్లాడుతూ నవంబర్ 21 నుంచి 30 తారీఖు వరకు రాష్ట్రవ్యాప్తంగా టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్ పోరుబాటు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ా్యక్రమంలో వచ్చిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా చలో కలెక్టరేట్ పెట్టామన్నారు. పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామ్యం అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్లో సంక్షోభంలో ఉన్నాయన్నారు. 2018 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్నప్పుడు పెంచిన మెస్ ఛార్జీలు ఇప్పటికే అవే అమలు కావడం దారుణం అన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. సంక్షేమ హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు కటారి శివ, రాయచోటి నియోజకవర్గం అధ్యక్షులు దేవేందర్ ప్రసాద్, పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు ఎన్టీఆర్ నఫీస్ చంద్ర శేఖర్, హరి, హేమాద్రి పాల్గొన్నారు. **నాయకులను పరామర్శించిన సుగవాసి** టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని చలో కలెక్టరేట్ క్రమంలో అరెస్టయిన నాయకులను పోలీస్ స్టేషన్‌లో టిటిడి మాజీ పాలకమండ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పరామర్శించారు. శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. వెంటనే నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామాంజులు

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి : 'సిటు'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పదేళ్లలోపు సర్వీసు ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసం హరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల సర్వీసు పూర్తికాని కార్మికులను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేయడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుని హోదాలో అసెంబ్లీలో మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వేర్వేరు కాదని ఇద్దరు చేసే పని ఒకటేనని, వారందరినీ రెగ్యులర్ చేయాలని అప్పట్లో మాట్లాడి, ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుతం రెగ్యులరైజ్ చేయలేదన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షులు కె సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన అంశాల ప్రకారం సమాన పనికి-సమాన వేతనం అమలు చేయకపోగా ఉద్యోగుల 10 సంవత్సరాలు సర్వీస్‌లోపు ఉన్న 12 మంది ఉద్యోగులను తొలగిస్తూ 1232 నెంబర్ ప్రకారం ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని వాపోయారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేరుగా జోక్యం చేసుకొని వెంటనే ఉత్తర్వులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించబోమని ముఖ్యమంత్రి చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ రంగం నాయకులు సి.నాగేశ్వరగౌడ్, మురళి, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.సి. వెంకటయ్య, సిఐటియు నాయకులు జయన్న పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 233 దరఖాస్తులు

ప్రజాశక్తి-గాలివీడు

కొత్తగా ఓటు నమోదుకు 233 మంది దరఖాస్తులు చేసుకున్నారని తహశీల్దార్ దైవాదీనం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18-19 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా 233 ఓటర్ దరఖాస్తులు అందాయన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి

- జెసి తమీమ్ అన్సారీయా

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగేలా ఎప్పటికప్పుడూ పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఆర్‌డిఒ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్ జిల్లా నలుమూలల ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయా శాఖల్లో తమ కింది స్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి బియాండ్ ఎస్‌ఎల్‌ఎలోకి ఏ ఒక్క అర్జీ వెళ్లకుండా వెంటనే పరిష్కరించాలని జెసి జిల్లా అధికారులను ఆదేశించారు .గడువు దాటి ఒక్క సమస్య కూడా ఉండకూడదన్నారు. అధికారులు అందరూ బాధ్యతతో స్పందన సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం గురించి అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులు ప్రతివారమూ ఎక్కడెక్కడ వెళ్లారు, ఏమి చేశారు క్షేత్రస్థాయిలో పర్యటించిన టూర్ డైరీను రిపోర్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి తమీమ్ అన్సారీయా

డిఇఒను సస్పెండ్ చేయాలి : విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - రాయచోటి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

జిల్లా విద్యాశాఖ అధికారి వై రాఘవరెడ్డి సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో డిఇఒను సస్పెండ్ చేయాలని ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఇఒ కులం, మతం పేరుతో ఉపాధ్యాయులను దూషిస్తున్నారని చెప్పారు. కొందరికి ఇష్టాను సారంగా సోకాజ్ నోటీసులు ఇచ్చి దుర్భాషలాడారని పేర్కొన్నారు. ఆయనకు అనుకూలమైన వారి పట్ల ఒక రకంగా, కానివారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దళితులు, మైనారిటీలు, బలహీన వర్గాలు, మహిళల పట్ల ఆయన వ్యహార శైలి అభ్యంతరంకరమన్నారు. చిన్న చిన్న కారణాలతో తనకు గిట్టని ఉపాధ్యాయులను ఆఫీసుకు పిలుపించుకొని జరిమానా విధిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు తీసుకోవడం లేదు అన్నారు. డిఇఒగా వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఎటువంటి మార్పు అనేది కనపడడం లేదన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలను అతిక్రమిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఈ విషయాలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌జెడి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పు కనపడడం లేదని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకొని ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేసి డిఇఒ ఆరోపణలపైన వాస్తవాలు వెలికి తీసి డిఇఒను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరావధిక నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పక్రుద్దీన్, రాజు, రాము, మోహిత్ భరత్ జాన్ కుమార్, ఆర్ఎస్‌యు, ఐఎఫ్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే క్షయ నిర్మూలన : జెసి


రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న జెసి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో టిడి కోసం చికిత్స పొందుతున్న వారికి బలవర్థకమైన ఆహారాన్ని అందించేందుకు 'ని-క్షయ్ మిత్ర' గా ద్వారా దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని, క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దేందుకు జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో నిర్ధారిత టిబి రోగులకు వారి సమ్మతితో దాతల సహకారంతో పౌష్టిక ఆహార పదార్థాలను జాయింట్ కలెక్టర్ చేతుల మీదగా వైద్యాధికారులు అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతు సమాజంలో క్షయ వ్యాధి గ్రస్తులకు 'ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అబియాన్' నిక్షయ్ మిత్ర పథకం ద్వారా పౌష్టికాహారం అందించేందుకు భారత ప్రభుత్వం ఆరోగ్య శాఖ ద్వారా 2022 సెప్టెంబరు 9న ప్రారంభించిందన్నారు. 2025 నాటికి భారత దేశాన్ని టిబి రహిత దేశంగా ఉంచాలన్నదే దీని ముఖ్యోద్దేమన్నారు. క్షయ రోగులకు సహాయం అందించడానికి ఇష్టపడిన వారు నిక్షయ్ పోర్టల్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాన్నారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి తమ బాధ్యతగా కనిషం ఒక్క టిబి పేషంట్ ను 6 నెలల పాటు దత్తత తీసుకొని పౌష్టిక ఆహార పదార్థాలు అందచేయాలని పిలుపునిచ్చారు. అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ మాట్లాడుతూ టిబి వ్యాధికి అధికశాతం జనాభా గురవుతున్నారని పేర్కొన్నారు. టిబి వ్యాధి 6 నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, డిసిహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మరింత మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి టిబి రోగులను దత్తత తీసుకోవాలని, కోరారు. నిక్షయ్ మిత్రలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసులు, గంగన్న పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న మల్లు శివారెడ్డి

రూ.2 కోట్లతో వృద్ధాశ్రమానికి భూమిపూజ

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని అక్కంపల్లి సమీపంలో రూ.రెండు కోట్లతో వృద్ధాశ్రమానికి తన సొంత నిధులతో మాజీ సమితి ప్రెసిడెంట్ మల్లు శివారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కోసం ఎలాంటి ఆధారాలు లేకుండా కన్న బిడ్డలు లేకుండా ఒంటరిగా ఉన్న వారి కోసం తన సొంత నిధులతో వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో పనులు కూడా కొనసాగిస్తామన్నారు. బిడ్డలు లేని వారు అర్హత ఉన్నవారు వీలుంటుందని చెప్పారు. పేదవారి కోసం వివాహ కార్యక్రమాల కోసం కల్యాణ మండలం కూడా నిర్మిస్తామని తెలిపారు. దళితుల మామిడి చెట్లను నరకడంపై చాలా బాధాకరమని పేర్కొన్నారు. రెండేళ్ల కిందట నాటిన చెట్లలో ఈ రోజు నరకడం చాలా బాధాకరమన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భవిత కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా మానసిక వికలాంగులకు అన్ని రకాల పరీక్షల నిమిత్తం వచ్చిన నిమిత్తం వచ్చిన పిల్లలకు వారి కుటుంబ సభ్యులకు సోమవారం లయన్స్ ఆధ్వర్యంలో లయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి ఆర్థిక సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ పరీక్షల నిమిత్తం వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్నదానం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటామని తెలిపారు. అనంతరం భవిత కేంద్రం సిబ్బంది నాగేంద్ర నాయక్ మాట్లాడుతూ లయన్స్ తమ కేంద్రానికి పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మానసిక వికలాంగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్లుగా బిసిలకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బిసిల ద్రోహి అని మూడున్నరేళ్లుగా బిసిలకు తీవ్ర అన్యాయం చేశారని గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో బిసి నాయకులు దుర్గాప్రసాద్, చంద్ర, ఖాదర్‌వలీ, మురికి నాటి వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు అనంపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి స్థానిక తహశీల్దార్ రవిశంకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ చేతి, కులవృత్తులు చేసుకుంటూ జీవనం పొందే బిసిల అభివృద్ధి మృగ్యమైపోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రద్దు చేసిన పది శాతం రిజర్వేషన్లను పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలన్నారు. అందుకు ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి చేయాన్నారు. ప్రభుత్వ సలహాదారులు వైస్ చాన్సలర్‌లలో 34 శాతం బిసిలకు ఇవ్వాలని చెప్పారు. జీవో నెంబర్ 217ను రద్దు చేయాలన్నారు. బిసి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఉప సంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి హరి,అమర్నాథ్ రెడ్డి, రైతు విభాగం ఉపాధ్యక్షులు చిన్న కృష్ణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

మదనపల్లె అర్బన్: స్థానిక పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవాన్ని డైరెక్టర్ లలితమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం ఏటా డిసెంబర్ 5న సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు, పర్యావరణాన్ని మార్చడంలో స్వచ్ఛంద సేవకుల ప్రయత్నాలను గుర్తించే రోజని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు అన్ని తమ ప్రాంతాలలో ఉన్న కుటుంబాలకు, పిల్లలకు, మహిళలకు ఇబ్బంది కలిగించే సమస్యలపై దృష్టి సారించి వాటి నిర్మూలన దిశగా ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలు, వైఖరులు, ప్రవర్తనలను మార్చడం, ద్వారా వారిలో మార్పునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, మండల కో-ఆర్డినేటర్ రాధారాణి, సిబ్బంది ప్రభావతి, నరసింహులు, సుభాషిణి, వెంకటరమణ, జ్యోతి, రమేష్ పాల్గొన్నారు.

బిసిలపై దాడులు దారుణం

మదనపల్లె అర్బన్: జగన్ పాలనలో రాష్ట్రంలో బిసిలపై దాడులు చూస్తుంటే రాజ్యాంగం ఏ విధంగా అమలు చేస్తున్నారో మనకు అర్థమవుతుందని రామచంద్ర యాదవ్ ఇంటిపై వైసిపి దాడిని ఖండిస్తున్నామని టిడిపి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గంటా నరహరి అన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలకు అండగా ఉంటున్నామనీ, బిసిల సంక్షేమ పాలనని మాటలు చెబుతూనే దాడులకు అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. న్యాయాన్ని కాపాడ వలసిన పోలీసులు అధికార పార్టీకి మద్దతుగా నిలిచి ప్రతిపక్షాలను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా ఎఒయు 40 ఏళ్ల వేడుక

మదనపల్లె అర్బన్: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటై 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆదేశాల మేరకు బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా యూనివర్సిటీ ఇచ్చిన అర్హతను బట్టి ప్రతి ఒక్కరూ డిగ్రీ చేసుకునే వెసులుబాటును యూనివర్సిటీ కల్పించిందని పేర్కొన్నారు. కో-ఆర్డినేటర్ డి.వెంకటశివారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఎంతో మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నరని ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాక్ట్ కరిముల్లా పాల్గొన్నారు.


పాఠశాల లైబ్రరీకి పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ పుష్పలత

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-రామాపురం

గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన గనులు లాంటివని కెజిబివి ప్రిన్సిపల్ పుష్పలత అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో సోమవారం సేవ్‌దిచిల్డ్రన్ సంస్థ కెజిబివి లైబ్రరీకి విద్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక విలువలు, జ్ఞానం పెంపొందించడానికి పుస్తక పఠనం చాలా ముఖ్యమన్నారు. ముఖ్యుల చరిత్రలు, రామాయణ మహాభారత ఇతిహాసాలు ధర్మవిలువలు, అన్నదమ్ముల అనుబంధాలు, తల్లి తండ్రుల పట్ల, ప్రేమ ఉపాధ్యాయుల పట్ల, పెద్దలపట్ల ఎలా మెలగాలో పుస్తక పఠనం నేర్పి స్తుందని అన్నారు. విద్యా ర్థులకు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి విలువైన పుస్త కాలను అందించిన సేవ్ ది చిల్డ్రన్ సంస్థ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యా ర్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సేవ్‌దిచిల్డ్రన్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి రఫీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లమ్మ, ఉపాధ్యా యులు హసీనా,హాజతున్నిసా ,రామానుజులమ్మ , సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రామసముద్రం మండల సమావేశం

రామసముద్రం : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యంపిపి కుసుమ కుమారి సుందరం ఆధ్వర్యంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపిడిఓ సురేష్ బాబు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నవాజ్ బాషా పాల్గొనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖలఅధికారులు పాల్గొనాలని తెలిపారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేది ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విభిన్న ప్రతిభావంత పిల్లలకు అవసరమైన పరికరాల నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశామని ఎంఇఓ రెడ్డిశేఖర్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాలల పరిధిలోని దివ్యాంగులకు సమాచారం అందించాలన్నారు. 3 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపల వయసు కలిగిన పిల్లలకు వినికిడి మిషన్లు, నడవలేని పిల్లలకు వీల్ చేర్స్, రోలేటర్స్, ట్రై సైకిళ్ళు అవసరమైన వారి గుర్తించి 7వ తేదిన మదనపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తీసుకుని రావాలని సూచించారు. ఈ శిబిరానికి తీసుకువచ్చే దివ్యాంగ పిల్లలు ఆధార్ కార్డ్ జిరాక్స్, సదరమ్ సర్టిఫికెట్ సర్టిఫికెట్, రేషన్ కార్డ్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కలెక్టరేట్ వద్ద అర్జీదారులకు భోజనాన్ని అందిస్తున్న వైసిపి నాయకులు

అర్జీదారులకు భోజన సదుపాయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. ఈ కార్యాలయాలు ఊరి బయట ఉండటంతో సమీపంలో హోటళ్లు లేకపోవడంతో అర్జీదారులు, ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు కార్యాలయాల వద్దకు సోమవారం ఎంతమంది వస్తున్నారనే అంచనాలను సిద్ధం చేసుకుని, సుమారు 350 మందికి ఉచితంగా భోజన వసతిని కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి స్పందన కార్యక్రమానికి ప్రజలు వస్తుంటారని, వారు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ఉచిత భోజన వసతిని కల్పించామని అన్నారు. ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేయడం పట్ల అర్జీదారులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కొలిమి ఛాన్ బాష, ఫయాజ్ అహ్మద్, సుగవాసి శ్యామ్, జావీద్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి -నిమ్మనపల్లి


మానసిక వ్యాధిగ్రస్తునికి పింఛను అందిస్తున్న వాలంటీర్

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిన వ్యాధి గ్రస్తునికి పింఛన్ అందించి మానవత్వం చాటుకుంది ఓ వాలంటీర్. మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీ సచివాలయం-1 పరిధిలోని బురుజుమాదిగ పల్లిలో నివాసముంటున్న ఎస్.నారా యణ రెడ్డి కుమారుడు ఎస్.శ్రీని వాసులు రెడ్డి గత కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని లైన్ కేర్ ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బురుజు మాదిగ పల్లికి చెందిన వాలంటీర్ కే.ప్రియాంక బెంగళూరుకి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిక వికలాంగుడైన ఎస్.శ్రీనివాసులు రెడ్డికి పింఛను అందించి మానవత్వాన్ని చాటుకుంది. వాలంటీర్ ప్రియాంక అందించిన సేవకు సర్పంచ్ ఎన్.రెడ్డమ్మ, నరేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారప్ప, సచివాలయ సిబ్బంది అభినందించారు.

శ్రీనాథ్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి- కెవిపల్లి

టిడిపి నుంచి వైసిపిలోకి చేరిన పీలేరు మాజీఎమ్మెల్యే జి.వి. శ్రీనాథ్ రెడ్డిని సోమవారం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అనుచరులు, పార్ల మెంట్ నియోజకవర్గం కార్యదర్శి ద్వారక నాయుడులు సన్మానించారు. కార్యక్రమంలో పీలేరు, కెవిపల్లి మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశ్నించేవారి గొంతు నొక్కడమే వైసిపి నైజం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రశ్నించే వారి గొంతు నొక్కడమే వైసిపి ప్రభుత్వ నైజమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ విమర్శించారు. గతంలో రాజంపేట పార్లమెంటు పరిధిలో జరిగిన ఘటనల్లో అధికార పార్టీ బనాయించిన కేసుల్లో భాగంగా సోమవారం ఆమె తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, టిడిపి రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాళగిరి దొరస్వామి నాయుడు, పఠాన్ ఖాదర్ ఖాన్, మాబుఖాన్ ,శ్రీరాములతో కలిసి మదనపల్లె కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫర్వీన్‌తాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించినందుకు తమపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజ సమన్నారు. తప్పుడు కేసులు భయపడేది లేదని, ప్రస్తుతం జరగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ది చెబుతారన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతుసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ' వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష' పథకం ద్వారా దళారీ వ్యవస్థకు స్వస్తిపలక వచ్చునని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలి పంచాయతీలోని సీతారామపురం గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న భూ శాశ్వత హక్కు, భూ రక్షణ ద్వారా మంజూరైన పత్రాలను రైతులకు అందజేశారు. కార్య క్రమంలో 132 మంది రైతులు పత్రాలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన శాశ్విత భూహక్కు పథకం ద్వారా దళారీ వ్యవస్థను పారద్రోలడమే కాకుండా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా భూములు రీ సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలో కార్స్ టెక్నాలజీ వినియోగించి అస్తవ్యస్తంగా ఉన్న భూ రికార్డులను సరి చేసినట్లు చెప్పారు. భూముల విస్తీర్ణం ప్రకారం రికార్డులు తయారు చేయడం జరిగిందని అన్నారు. సర్వే నెంబర్ల వారీగా హద్దురాళ్ళు లేకపోవడం వలన సరిహద్దుల్లో తగాదాలు జరిగేవని తెలిపారు. తగాదాలకు స్వస్తి పలుకుతూ ప్రస్తుతం జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ పథకం ద్వారా ఉచితంగా హద్దురాళ్లను నాటించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళి రెడ్డి, ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయకులు కొండూరు శరత్ కుమార్ రాజు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి, పోలి మురళి రెడ్డి, మందరం వేణుగోపాల్ రెడ్డి, మందరం గంగిరెడ్డి, రాజమో హన్ రెడ్డి, సర్వేయర్ వెంకటసుబ్బయ్య , వైసిపి నాయకులు పాల్గొన్నారు.


మహిళకు పత్రాన్ని అందజేస్తున్న మేడా మల్లికార్జునరెడ్డి

కొనసాగుతున్న కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మండలంలోని మంగంపేట ఎపిఎండిసి జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న, అవుట్సోర్స్ ట్రైన్ కార్మికులకు, సమాన వేతనం, టోల్ ట్రీ అగ్రిమెంట్ ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరి 4 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 14వ రోజు ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ఉద్యోగులు కార్మికులు నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎపిఎండిసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి సి హెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎపిఎంసి వర్కర్స్ యూనియన్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్ యూనియన్, సిఐటియు అనుబంధం రెండు యూనియన్ల మద్దతుతో నూతన జెఎసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు ఇచ్చి 14 రోజుల నుంచి ఆందోళన నిర్వహిస్తున్నా యాజమాన్యం స్పందిక పోవడం సరికాదని అన్నారు. పోరాడే సంఘాలను, జెఎసిని మాత్రమే చర్చలకు పిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మేనేజ్మెంట్ సంబంధం లేని వారిని చర్చలకు పిలిచి, కార్మికుల ద్రోహం చేస్తే సహించేది లేదని తెలిపారు. 535 మందికి న్యాయం జరిగితేనే ఆందోళన విరమిస్తామని లేకుంటే సమ్మె కైనా వెనుకాడేది లేదని హెచ్చరించారు. జెఎసి కన్వీనర్ రేకులకుంట వెంకటేష్ మాట్లాడుతూ పోరాటం చేస్తున్న మూడు యూనియన్లతోనే చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని, అంతవరకు పోరాట కమిటీ ఆందోళన జరుగుతుందని తెలిపారు. పదవ తేదీన జరిగే, యాజమాన్యం చర్చలు, పోరాడే సంఘాలతోనే, చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం జెఏసి రాజీలేనిపోరాటం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంసి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బండారు భాస్కర్, ఎపిఎండిసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు అనుబంధ, కార్యదర్శి నారదాసు సుబ్బరాయుడు, కోశాధికారి, మావిళ్ళ శేఖర్, జేఏసీ కోశాధికారి, ఈశ్వరయ్య, కో కన్వీనర్ ఆనుమల గుండం అరుణావతి, గల్లా జయశ్రీ, దేవకుమార్ రెడ్డి, జిఎస్ మనీ, వేణుగోపాల్ రెడ్డి, కోటూర్ ప్రతాప్, దానమయ్య, పులగంటి రమణయ్య, ఎస్ పెంచలయ్య,అంకయ్య బాబు, గునిపాటి వేణు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


ఎపిఎండిసి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ స్వాతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రతినెలా ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించే కార్యక్రమంలో భాగంగా సోమవారం దాదాపుగా 50 మంది గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించినట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ స్వాతి తెలిపారు. పట్టణంలోని ముజీబ్ నగర్ అంగన్వాడి సెంటర్, బికె పల్లి వైఎస్ఆర్ కాలనీ ధాత్రి కార్యాలయంలో పౌష్టికాహార కిట్లలో రాగిపిండి మల్టీ గ్రైన్స్, గోధుమపిండి, బెల్లం చిక్కిలు, బరుగుంటలు, బెల్లం క్యారెట్ బీట్రూట్ బీన్స్ బ్రెడ్, పండ్లు, కూరగాయలు, ఒక కిట్టుగా తయారుచేసి 50 మంది గర్భిణీ మహిళలకు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పాపులమ్మ,అన్నపూర్ణమ్మ గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

యువత క్రీడల్లో రాణించాలని వైసిపి మైనారిటి నాయకులు బేపారీ మహమ్మద్ ఖాన్ తెలిపారు. జగనన్న క్రీడా సంబరాలల్లో భాగంగా వాయిల్పాడులో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో రాయచోటి టీం ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో టీం సభ్యులను ఆయన అభినందించారు. సోమవారం తన కార్యాలయంలో టీంకోచ్, సభ్యులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్న సంకల్పంతో ప్రభుత్వ హైస్కూల్లో ఇండోర్ స్టేడియం, నక్కావాండ్లపల్లె సమీపంలో క్రికెట్ మైదానం ను ఏర్పాటుకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మైనారిటి నాయకులు కొత్తపల్లె ఇంతియాజ్, బేపారీ జబివుల్లా ఖాన్, రెడ్డెయ్య, క్రికెట్ కోచ్ మహమ్మద్ అలీ, క్రిష్ణారెడ్డి, సలీం, బాబ్జీ, సమీర్, మన్సూర్, సిద్ధిక్, మహమ్మద్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు వివేకానంద సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి -పుల్లంపేట

అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘాన్ని వివేకానంద సేవారత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం ప్రొద్దుటూరు ఎస్.ఆర్.ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి నిర్వహించారు. రాయలసీమ ప్రాంత స్వచ్ఛంద సంస్థలలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన 30 స్వచ్ఛంద సంస్థలను ఎంపిక చేసి ఈ అవార్డు ప్రధానోత్సవం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మల్లు సుబ్బనరసారెడ్డి మాట్లా డుతూ కరోనా విపత్తు సమయంలో, అన్నమయ్య ముంపు గ్రామాల బాధితులను ఆదుకోవడంలో తదితర సామాజిక కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా తమ వంతుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా వివేకానంద సేవారత్న 2022 పురస్కారం అందించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీసెస్ కన్వీనర్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, ఇంజనీరింగ్ కళా శాల వ్యవస్థాపకులు బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ, ప్రముఖ సామాజిక కార్యకర్త రాజోలి శ్రీధర్ రెడ్డి, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి- తంబళ్లపల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన104 వాహనంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలో అందించేందుకు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నారు. కోసవారిపల్లి పిహెచ్‌సి డాక్టర్ నిరంజన్ రెడ్డి సోమవారం పరసతోపు సచివాలయంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు వృద్ధులు, ప్రజలకు బిపి, షుగర్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంసిఎ విద్యార్థులకు జావా ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్మెంట్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల పూర్వ విద్యార్థి మునిస్వామి, టెక్నికల్ లీడ్-ఒరాకిల్ ఇండియా బెంగళూరు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీ సెక్టార్‌లో ఫుల్ స్టాక్ వెబ్ డెవలప్మెంట్ పై మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ రంగములో నే కాకుండా జావా డెవలప్మెంట్ మీద ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అలుమ్ని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ రెడ్డి, ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్, కోఆర్డినేటర్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశ ప్రాంగణానికి భూమిపూజ

ప్రజాశక్తి -పెద్దమండ్యం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సమావేశం కొరకు ప్రాంగణం నిర్మిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు గాజుల రామకృష్ణ తెలిపారు. స్థానిక పాఠశాల నందు 1990-91 సంవత్సరం నాటి విద్యార్థులు ఈ ప్రాంగణం నిర్మిస్తునట్లు పేర్కొన్నారు. వారి చేతుల మీదుగానే సోమవారం భూమిపూజకు ఒకలక్షా నూట పదహారు రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 1990-91 నాటి విద్యార్థులు, ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడంతో పాటు భూమిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం అమరనాథ రెడ్డి అన్నారు. ప్రపంచ భూసార పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్త ప్రాణకోటికి జీవనాధారమైన భూమి క్రమేపి విషతుల్యమవుతుందని, విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వాడకం, ఇతర కాలుష్య కారకాల ప్రభావంతో సారం కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ నేలకు రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులు సేంద్రియ ఎరువులు, పంచగవ్య, జీవామృతం వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర, వెంకటేశ్వర్ రెడ్డి, నాగరాజ, నాగేశ్వర, చంద్రశేఖర్, భాస్కర్, రసూల్, దూర్వాసులు నాయుడు, వసుమతి, హైమావతి, నాగసులోచన, కల్పలత, చెంగయ్య, నిర్మల, ఖదీర్, రెడ్డెమ్మ, శేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి మహాసభను జయప్రదం చేయండి

వాల్మీకిపురం :వెనుకబడిన కులాలే వెన్నెముక అనే నినాదంతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిసెంబర్ 7వ తేదిన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న బిసి మహాసభకు భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆర్‌బికె చైర్మెన్ నీళ్లభాస్కర్ కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సముచిత స్థానాన్ని కల్పిస్తున్నారన్నారు. మండలంలోని బిసి నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్రమణ, నాయకులు ఆనంద, రాయుడు, నరసింహులు, భాస్కర, మునిభాస్కర, గుర్రప్ప, రెడ్డెప్ప, చలపతి, చిన్నప్ప, శీనా, సుధాకర, విశ్వనాథం పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిపి

తంబళ్లపల్లి : తంబళ్లపల్లె మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపిపి అనసూయమ్మ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి లు కోరారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అనసూయమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల స్థాయి అధికారులు శాఖల వారి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక పై వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలపై అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు చేరుతున్న లబ్ధి తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్నారెడ్డి, కోఆప్షన్ సభ్యులు జమాల్ బాషా, తహశీల్దార్ కళావతి, ఎంపిడిఒ ఆనంద్ కుమార్, సింగల్ విండో చైర్మన్ భార్గవ్ రెడ్డి, ఆర్.బి.కె చైర్మన్ రెడ్డి మల్రెడ్డి, మల్లయ్య కొండ చైర్మన్ మల్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదవారి ఇంటి వద్దకే వైద్య సేవలు

నందలూరు : పేదవారికి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , ఆడపూర్ సచివాలయ పరిధి లోని వృద్ధులకు, గర్భిణీ లకు, బాలింతలకు పిల్లలు, క్షయ, జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సి.హెచ్.చంద్రశేఖర్

కెవిపిఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఓబులవారిపల్లి మండల కమిటీ సోమవారం నిర్వహించారు. ఈసమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, తెలిపారు. అధ్యక్షులుగా తలారి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా నాగిపోగు పెంచలయ్య. కోశాధికారిగా అందే సురేంద్ర, ఉపాధ్యక్షులుగా వై సుబ్బరాయుడు, గోదాల సుబ్బయ్య, చెన్నూరు గంగయ్య, వై దేవరాజు, కొర్లగుంట గంగయ్య, సహాయ కార్యదర్శులుగా, వై.వెంకటేష్, ఏ.భాస్కర్, నాగిపోగు జయరాం, గుంజపల్లి చిన్నయ్య, చెన్నూరు రఘురామయ్యలను ఎన్నుకున్నారు. ఆహ్వానితులుగా జయరామయ్య, హరిబాబు, దార్ల సుధాకర్ లను ఏకగ్రీవ ఎన్నుకున్నారు. ఓబిలి పెంచలయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. కుల వివక్షతకు, అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రతిఘటన, ఉద్యమాలు నిర్వహించిందని చెప్పారు. కెవిపిఎస్ పోరాట ఫలితంగా జస్టిస్ పున్నయ్య కమిషన్, ఏర్పాటు చేయడం జరిగిందని, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ సాధించామని అన్నారు. భూమికోసం పోరాడి అనేకమంది దళితులకు, బిసిలకు భూములు ఇప్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.జయ రామయ్య ,హరి , అంకిపల్లి చంగయ్య, దార్ల సుధాకర్ పాల్గొన్నారు.


తహశీల్దార్ ఉదయశంకర్‌రాజుకు వినతిపత్రం ఇస్తున్న బిసి నాయకులు

బిసిలకు న్యాయం చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-నందలూరు

బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం టిడిపి బిసి నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి బిసిసెల్ రాష్ట్రఉపాధ్యక్షులు తాటిసుబ్బరాయుడు మాట్లాడుతూ అనాదిగా బిసిలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు ఉంటే వైసిపి ప్రభుత్వం వచ్చాక 24శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. 16800 స్థానిక సంస్థలు పదవులను పొందే అవకాశాన్ని నాశనం చేశారని అన్నారు. సబ్సిడీ రుణాలు లేకుండా చేసారని, 36 వేల కోట్ల రూపాయల సబ్ ప్లాన్ నిధులు పక్క దారి పట్టించారని ఆరోపించారు. 56కార్పొరేషన్లు ఏర్పాటుచేసి కనీసం ఒక్క రూపాయి కూడా నిదులు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ ప్రభు త్వంలో బిసిలకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదరణ పథకం పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. తహసిల్దార్ ఉదయశంకర్‌రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బిసిలు గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య, తుంటి రమణయ్య, జంగం శెట్టి సుబ్బయ్య, కుర్ర మణి పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంఘం ఉపాధ్యక్షుడు వహీద్

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలం భవిత పాఠశాలలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవము సోమవారం ఐఆర్‌టి ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘఉపాధ్యక్షులు వాహిద్ పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల భవిష్యత్తుకు సమ్మిళిత విద్య నేర్పటం ఉపాధ్యాయులపై ఉంటుందని అన్నారు. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని, భవిష్యత్తులో వారి అవరాలపై అవగాహన కలిగించే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి వారము ఫిజియోథెరఫీ కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లల్లో ఆరోగ్యము పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో మా సంఘం తరపున ఎటువంటి సహాయ సహకారములు అందించడానికైనా సిద్దంగా ఉంటామని తెలిపారు. అనంతరం పిల్లలకు బహు మతులను అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- కలకడ

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జుగుంటపల్లి వడ్డిపల్లి కు చెందిన రెడ్డి చంద్ర కుమారుడు రెడ్డి ప్రకాష్ , కలకడ కాలవ గడ్డమీద చెందిన మహబూబ్ హుస్సేన్ కుమారుడు మస్తాన్ లు కలసి ఏపీ 04 7146 నెంబర్ గల ద్విచక్ర వాహనంలో కలకడ నుండి రాయచోటి వైపు వెళ్తున్నారు. రాయచూరు నుండి తిరుపతి వెళ్తున్న ఏపీ 04 ఎకె 7713 నెంబర్ గల కారును మల్లికార్జున నాయుడు అధివేగంగా, అజాగ్రత్తగా నడపడం వలన ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇరువురిని ఢీకొంది.ఈ ప్రమాదంలో రెడ్డి ప్రకాష్ కు ఎడమ చేతి నరాలు తీగిపోగా, తొడకు, తనకు బలమైన రక్త గాయాలైనట్లు తెలిపారు.ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి మస్తాన్ కు ఎడమ కాలు విరిగి ,తలకు తీవ్రమైన రక్త గాయాలు కావడంతో హుటాహుటిన వీరిని ప్రైవేటు వాహనంలో తిరుపతి సిమ్స్ వైద్యశాలకు తరలించిన తెలిపారు. రెడ్డి ప్రకాష్ మామ రెడ్డి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు.

యువతిని మోసిన మహిళ అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తల్లిదండ్రులకు తెలియకుండా విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని యువతిని మోసం చేసి విదేశాలకు పంపిన కేసులో నిందితురాలైన సల్మాను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మదనపల్లె పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన యువతిని పీలేరు పట్టణంలోని సైనిక్ వీధికి చెందిన సల్మా ఇదే ప్రాంతానికి చెందిన జాంబియా దేశంలో ఉన్న వినోద్ కుమార్ వద్దకు పంపారని అన్నారు. వినోద్ కుమార్ ఆమెతో లైంగిక వేధింపులకు పాల్పడడంతో ఆమె తిరిగి మదనపల్లికి వచ్చేసింది. మళ్లీ సల్మా, వినోద్ కుమార్ అతని కుటుంబ సభ్యులు యువతిని వేధింపులకు గురి చేయడంతో యువతీ తల్లి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో నిందితురాలైన సల్మాను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్పి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నగర పర్యటన నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని ఎస్పి అన్బురాజన్ ఆదేశించారు. సోమవారం బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి మంగళవారం నగరానికి విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రఖ్యాత పెద్ద దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం రాయచోటి రహదారిలో మాధవి ఫంక్షన్ హాలులో ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి కుమార్తె రిసెప్షన్‌కు హాజరవుతారని చెప్పారు. ముఖ్యమంత్రి నగరానికి విచ్చేసింది మొదలు తిరిగి వెళ్లేంత వరకు చేపట్టాల్సిన బందోబస్తుపై సెక్టార్ వారీగా విభజించామని పేర్కొన్నారు. విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే దారిలో పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

జగనన్నా.. సమస్యలు చూడన్నా..!

- రూ.305 కోట్ల కడప నగర రోడ్ల విస్తరణ ప్రశ్నార్థకం
- రూ.70 కోట్ల స్ట్రోమ్‌డ్రైయిన్ల హామీ అటకెక్కిన వైనం
- సాగుతున్న...రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ పనులు
- ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు మోక్షమెప్పుడో?
- చెన్నూరు చక్కెర పరిశ్రమ హామీ అమలేదీ
- నేడు కడపకు సిఎం జగన్ రాక



'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా కడప నగరం ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. నగరంలోని ప్రధాన సమస్యలైన నాలుగు ప్రధాన రహదారుల విస్తరణ పనుల దగ్గర నుంచి మోస్తరు చినుల ధాటికి జలమయం అవుతున్న కడప నగరం లోని నాలుగు స్ట్రోమ్‌వాటర్ డ్రైయిన్లు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ, చెన్నూరు సుగర్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఇచ్చిన హామీలు అమ లుకు నోచుకోవడం లేదు. దీనికితోడు రూ.454 కోట్ల రిమ్స్ బోధ నాస్పత్రి, సైక్రియాటిక్, కేన్సర్‌బ్లాక్, సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ పనులు, కొప్పర్తి పారిశ్రామికవాడలోని పరిశ్రమలు, బద్వేల్ నగరంలోని గోప వరంలో ఏర్పాటు చేయతలపెట్టిన సెంచురీ ఫ్లైవుడ్ పరిశ్రమలు, హాజీహౌస్ పనులు, కొప్పర్తి పారిశ్రామికవాడకు నీటిని అందించే పైప్‌లైన్ పనులు ప్రారంభానికి నోచుకోని వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కథనం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగర అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థ పెండింగ్‌లో పడింది. 2007లో వైఎస్ ప్రభుత్వం రూ.72 కోట్లతో హైదరాబాద్, తిరుపతి నగరాల తరహాలో భూగర్భడ్రైయినేజీ వ్యవస్థను నిర్మించాలని తల పెట్టింది. రూ.72 కోట్లతో కూడిన టెండర్లను రాంకీ కాంట్రాక్టు సంస్థ టెండరను దక్కించుకుంది. 2015 నాటికి 68 శాతం పనులు పూర్తి చేసింది. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి శాఖల అవాం తరాల నేపథ్యంలో చేతులెత్తేసింది. టిడిపి సర్కారు 2018లో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 108.41 కోట్లతో భూగర్భ డ్రైయినేజీ వ్యవస్థ కాంట్రాక్టును దక్కించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకు ండా పోయింది.

- రూ.305 కోట్లతో కడప నగరంలోని అన్నమయ్య సర్కిల్, గోకుల్ లాడ్జి సర్కిల్, మాసాపేట సర్కిల్, వైజంక్షన్ సర్కిల్‌లోని రహదారుల విస్తరణ పనులు టెండర్లు దశను దాటడం లేదు. ఇదిలావుండగా కడప నగరపాలక సంస్థ మాసాపేట పరిసర ప్రాంతాల్లో రహదారి విస్తరణ పనుల పేరుతో ప్రత్యామ్నాయాన్ని చూపిం చకుండా నిరుపే దల నివాసాలతో బుల్డోజర్లతో కూల్చివేయడం విస్మయాన్ని కలిగిం చింది.
- రూ.70 కోట్ల విలువైన స్ట్రోమ్‌డ్రైయిన్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రిగా మీరిచ్చిన హామీ అటకెక్కింది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి స్ట్రోమ్‌డ్రైయిన్ కాల్వల ఆక్రమణలను తొలగించి విస్తరణ పను లు చేపట్టాల్సి ఉంది.
- రూ.454 కోట్ల విలువ కలిగిన రిమ్స్ బోధనాస్పత్రి, కేన్సర్, సైక్రి యాటిక్, సూపర్‌స్పెషాలిటీ హెూదా పనులు సా..గుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.
- దేశంలోని ప్రధాన నగరాలకే పరిమితమైన 110 ఎకరాల్లో రూ. 345 కోట్ల ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనుల్లో పురోగతి మందగిం చింది. ఫలితంగా యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని అయోమయం నెలకొంది.
- రూ.12 కోట్లతో కూడిన హాజీహౌస్ పనులు ఎప్పటికి పూర్తి నోచు కుంటుందో తెలియని అయోమయం ఏర్పడింది. నిధుల కొరత కారణంగా నిలిచిన పనుల్ని సకాలంలో పూర్తి చేయాల్సిన అవసరం ఏర్పడింది.
- రూ.50 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటి పైప్ లైన్ పనులు టెండర్లకు నోచని వైనం విస్మయాన్ని కలిగిస్తోంది. నీటి కొరత కారణంగా పరిశ్రమలు రావడానికి జంకుతున్న వైనం నివ్వయ్యాన్ని కలిగిస్తోంది.
- కొప్పర్తి పారిశ్రామికవాడలోని వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు ఎప్పటికి కార్యకలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. చెప్పుకోదగిన రీతిలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చిన దాఖలా లేవు.
- కడప నగరం శివారులోని పాల పరిశ్రమ కార్యకలాపాలు ఆశిం చిన రీతిలో సాగడం లేదు. వ్యవసాయ అనుబంధ రంగమైన పాల పరిశ్రమ పునరుద్ధరణలో భాగంగా జగనన్న పాలవెల్లువ వంటి పథకంలో భాగంగా కార్యకలాపాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- కడప ఆర్టీసీ డిపో పరిధిలోని రెండవ డిపో ఏర్పాటు, సిటీ బస్సుల సదుపాయాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయోనని ఎదురు చూపులు తప్పడం లేదు. జిల్లావాసి ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా మల్లి కార్జునరెడ్డి రావడంతో ప్రజల్లో పెట్టుకున్న ఆశాభావం వ్యక్తమవుతో ంది.
- 12 కోట్లతో కూడిన బుగ్గవంక ప్రహరికి ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు ఆశించిన రీతిలో సాగడం లేదు. బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ వంటి పనులు ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరి స్థితి ఏర్పడింది.
- చెన్నూరు సుగర్ పరిశ్రమ పునరుద్ధరణకు ముఖ్యమంత్రిగా మీరి చ్చిన హామీ అటకెక్కింది. వరుసగా మూడు రకాల కమిటీలు విచా రించినప్పటికీ రూ.60 కోట్ల నిధులు విడుదల చేయడంలో మీనమే షాలు లెక్కించడం విస్మయాన్ని కలిగిస్తోంది. తాజాగా కడప నగర పర్యటన సందర్భంగానైనా కడప నగర ప్రగతిని పరుగులు తీయిం చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుండెపోటుతో ట్రిపుల్‌ఐటి విద్యార్థి మృతి

శోకసంద్రంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



గుండెపోటుతో మృతిచెందిన విద్యార్థి వెంకట సాయిశకంర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో మెకానికల్ ఇంజినీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వెంకట సాయి శంకర్ (21) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో విషాదం నెలకొంది. బి కోడూరు మండలంలోని గోవిందంపల్లెకు చెందిన చెందిన రామాయణం వెంకట సుబ్బారావు కుమారుడు వెంకట సాయి శంకర్‌కు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడంతో ట్రిపుల్ ఐటిలో సీటు వచ్చింది. ప్రస్తుతం మెకానికల్ ఇంజినీర్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి వ్యాయామం చేసి హాస్టల్‌కు తిరిగి వస్తుండగా గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు ఈసీజీ తీసి మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలించాలని వైద్యులు చెప్పారు. దీంతో యూనివర్సిటీ అంబులెన్స్‌లో కడపకు తరలిస్తుండగా నందిమండలం వద్దకు రాగానే పల్స్ పడిపోయింది. వెంటనే అంబులెన్స్ సిబ్బంది సమీపంలోని నంది మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చూపించగా అప్పుగికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. తిరిగి వేంపల్లె ఆసుపత్రికి విద్యార్థి మృతదేహాన్ని తీసుకొని వచ్చారు.

శోకసంద్రంలో సహ విద్యార్థులు

వెంకట సాయి శంకర్ గుండె పోటుతో మృతి చెందాడని తెలియడంతో విద్యార్థులు శోక సముద్రంలో మునిగి పోయారు. క్రీడల్లో బాగా రాణించేవాడని పీడీ షంషాద్‌బేగం పేర్కొన్నారు. చదువు పూర్తి అయ్యేదశలో గుండె పోటుతో మృతి చెందడంతో బంధువులు, స్నేహితుల్లో విషాదం నెలకొంది. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆర్కేవ్యాలీ ఎస్ఐ రంగరావు తెలిపారు. **విద్యార్థి మృతి బాధాకరం : డైరెక్టర్** విద్యార్థి గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి చెప్పారు. మృతదేహాన్ని డైరెక్టర్ సంధ్యారాణి సందర్శించి నివాళులర్పించారు. విద్యార్థికి మంచి భవిష్యత్ ఉందని, ఇంతలోనే విద్యార్థి గుండెపోటుతో చనిపోవడం శోచనీయమని ఆమె తెలిపారు. **తులసిరెడ్డి నివాళి..** వెంకటసాయి శంకర్ మృతి వార్త తెలుసుకున్న పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి వెంటనే ఇడుపులపాయ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చిన్నవయస్సులోనే విద్యార్థి గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని తులసిరెడ్డి అన్నారు.

'సీమ' ప్రయోజనాలు తాకట్టు

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న పోతుల నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ ప్రయోజనాలను వైసిపి, టిడిపి తాకట్టు పెట్టాయని పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు విమర్శించారు. సోమవారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి తమ గొప్ప అంటూ తిరుపతి, కర్నూలులో సమావేశాలు నిర్వహించారని చెప్పారు. ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం విడిపోయి ఎనిమిదేళ్లయినా రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. నికర జలాలు లేకుండా, ప్రత్యేక ప్యాకేజీ రూ. 26 వేల కోట్లు కేంద్రం ప్రకటిస్తే ఎంత తెచ్చారో లెక్క చెప్పాలన్నారు. మూడు రాజధానుల పేరుతో అర్థంలేని వాదనను ప్రజలపై పెట్టారని పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధి చేయవద్దని ఎవరు అనలేదన్నారు. కేంద్ర సంస్థలు, కాలువల విస్తరణకు నోచుకోక వ్యవసాయానికి నీరు అందడం లేదని, ఉపాధి లేక యువత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పదివేల మందికి ఉద్యోగం కల్పించే ఒక్క పరిశ్రమమైన ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. ఢిల్లీలో రాయలసీమ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. కడపలో వెంటనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 20 24 ఎన్నికలను ట్రైన్‌గా ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రధాన పార్టీలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. వాస్తవాలు మాట్లాడడానికి ఎక్కడికైనా చర్చకు సిద్ధమని ప్రధాన పార్టీల నాయకులకు సవాల్ విసిరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు నాగ సుబ్బారెడ్డి, వెంకట శివ, శివ యాదవ్, చంద్రారెడ్డి, రాజేంద్రప్రసాద్, ఎం. ఆర్. నాయక్, ఓబులేసు పాల్గొన్నారు.

విద్యావంతులూ ఆలోచించి ఓటు వేయండి

బద్వేలు : విద్యావంతులు, మేధావులు అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రలోభాలకు లోనుకాకుండా ఆలోచించి ఓటు వేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను ప్రలోభాలకు గురి చేసేందుకు అధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఉద్యోగుల, నిరుద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఏ మాత్రం కృషి చేశారో తెలపాలన్నారు. రాయలసీమ అభివృద్ధికి కృషి కూడా చేయలేదని ముఖ్యమంత్రి జేబు సంస్థగా మారారని అన్నారు. ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాయలసీమ కోసం ఏమి చేశారో ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారని చెప్పాలన్నారు. కడప, అనంతపురం, కర్నూలుకు అధికార పార్టీ మేలు చేసిందేమీ లేదని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వీరశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేంద్ర, ఏఐటియుసి నాయకులు బాలు, రాజు, రమణ, నాగేశం, సిఐటియు నాయకులు ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.

సర్దుబాటు చేయడం తగదు : యుటిఎఫ్

కడప అర్బన్ : విద్యాశాఖలో సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు వేయడం తగద యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సర్దుబాటును వ్యతిరేకిస్తూ సోమవారం డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి బదిలీలలో ప్లేస్ మెంట్ ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు బదిలీల ప్రస్తావన లేకుండా వర్క్ అడ్జస్ట్ మెంట్ పేరుతో సర్దుబాటు ప్రక్రియ చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉపాధ్యాయ లోకాన్ని గందరగోళానికి గురి చేయటాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించిన ఉపాధ్యాయులకు స్థానాలను కేటాయించాలన్నారు. ఒకవైపు హైస్కూల్స్‌లో సబ్జెక్ట్ టీచర్స్ అవసరం అంటూ ప్రమోషన్లు పొందిన వారికి ప్లేసులు ఇవ్వకుండా, ప్రైమరీ నుంచి డిప్యుటేషన్స్ వేస్తున్నారని , ఉద్యోగోన్నతి పొందిన వారు సర్దుబాటులో భాగంగా దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 400 మంది ఉపాధ్యాయుల నుంచి అంగీకారాన్ని తీసుకుని ఉద్యోగోన్నతలు కల్పించడం వేధించడం చాలా హేయమైన చర్యని అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, దావుద్దీన్, మస్తానయ్యా, నాయకులు మస్తాన్ బాషా, కిరణ్ కుమార్, నాగిరెడ్డి, కరిముల్లా, శ్రీకాంత్, శ్రీనివాసచారి, సిద్దయ్య, వెంకటసుబ్బయ్య, జివిఎస్ తాజుద్దీన్, ప్రకాష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నేలల సంరక్షణపై ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఎన్‌సిసి కేడెట్లు

కడప : ఎన్ఎస్ఎస్, ఈశా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 'నేలల సంరక్షణ' అనే అంశం పైన కడప నగరంలో సోమ వారం అవగాహన ర్యాలీ నిర్వహి ంచారు. ర్యాలీ ఎర్రము కృపల్లి సర్కిల్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. తరిగి పోతున్న టువంటి నేల సామర్థ్యాన్ని ఏవిధంగా మనం తిరిగి పునరుద్ధరణ చేయాలనే అంశాన్ని చక్కనిచిత్రాల ద్వారా విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి విద్యార్థులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ పిఓలు శివరామ కృష్ణ, నాగరాజు, ఈషా ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యూ ఎసి కమిటీకి విసి ప్రశంసలు

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఇటీవల సాధించిన న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడేషన్ కౌన్సిల్)ఏ గ్రేడ్ ర్యాంక్ తో క్యుమిలేటివ్ గ్రేడ్ పాయింట్ ఆవిరేజ్ 3.13 సాధించడంలో ఐక్యూఎసి చేసిన కృషి ప్రశం సనీయమని సోమవారం విసి ఆచార్య మునగల సూర్యకళావతి కొనియాడారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ మూడేళ్లుగా ఐక్యూఎసి సభ్యులందరూ న్యాక్‌కు సంబంధించిన యాన్యువల్ క్వాలిటీ అసోసియేషన్ రిపోర్ట్,(ఏ క్యూ ఏ ఆర్), ఇన్‌స్టిట్యూషనల్ ఇన్ఫర్మేషన్ ఫర్ క్వాలిటీ అసెస్మెంట్ (ఐఐక్యుఏ), సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ (ఎస్ ఎస్ ఆర్) రూపకల్పనలో ఎంతో శ్రమించారని, నిబద్ధతతో పనిచేశారన్నారు. **ఐక్యూఎసి సంచాలకులుగా డాక్టర్ శర్మ** ఐక్యూఎసి నూతన సంచాలకులుగా రసాయన శాస్త్రం శాఖ సహ ఆచార్యులు డాక్టర్ సుబ్రమణ్యం శర్మను నియమించారు. ఈ మేరకు విసి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శర్మ ఐక్యూఎసి డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్ నేతృత్వంలో సభ్యులుగా ఇదివరకు పనిచేశారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి : డిసిసి

కడప : పిసిసి నూతన అధ్యక్షుడిగా మాజీ ఎంఎల్‌సి గిడుగు రుద్రరాజు ఈనెల 9న విజయవాడలో బెంజ్ సర్కిల్ లోని వేదిక కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిడుగు రుద్రరాజు పిసిసి అధ్యక్షుడిగా, డాక్టర్ తులసి రెడ్డి పిసిసి మీడియా చైర్మన్‌గా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మస్తాన్‌వలి, జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారని, తెలిపారు సమావేశంలో నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర ఎస్సీ సెల్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మల్లెం విజయభాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్ర సంపదను దోచుకున్న సిఎం : టిడిపి

కడప అర్బన్ : అమ్మ ఒడి, నాన్న బుడ్డి పేరుతో ప్రజల్లో భ్రమలు కల్పించి రాష్ట్ర సంపదను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దోచుకున్నారని టిడిపి కడప అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి. ఎస్. అమీర్ బాబు విమర్శించారు. 14వ డివిజన్‌లో క్లస్టర్ ఇన్‌ఛార్జి బాలదాసు ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ' నిర్వహించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర కార్య కార్యనిర్వ కార్యదర్శి జి. గోవర్ధన్ రెడ్డి, బాలిశెట్టి హరిప్రసాద్, నగర అధ్యక్షులు సానపరెడ్డి శివ కొండ రెడ్డి, వికాస్ హరికృష్ణ, డివిజన్ ఇంచార్జి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసుతో కలిసి అమీర్ బాబు మాట్లాడారు. ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేస్తూ, రేషన్ కార్డులను తొలగిస్తూ, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. ఒక్క అవకాశం పేరుతో ప్రజలను జగన్మోహన్ రెడ్డి వంచించి మోసం చేశారని పేర్కొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

కడప : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్ కవిత సోమవారం కడప నగరం ప్రకాష్ నగర్‌లో గల స్నేహాలయ షెల్టర్ హోమ్‌ను సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా (లీగల్ సర్వీసెస్ టు సీనియర్ సిటిజన్) పథకం 2016 గురించి వివరించారు. షెల్టర్ హెూమ్‌లో ఉన్న వారి ఆరోగ్య విషయాల పట్ల ఎప్ప టికప్పుడు శ్రద్ధ వహించాలని హెూం వారిని ఆదేశించారు. ఉచిత న్యాయ సహా యం గురించి వివరించారు, ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో షెల్టర్ హెూమ్ నిర్వాహకులు మరియు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్త దానం చేసిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు

కడప సిటీ: స్థానిక శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్ డిఎఫ్‌సి బ్యాంక్ ఆధ్వర్యంలో రిమ్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో 'ఇంటర్నేషనల్ వాలం టీర్ డే' ను పురస్కరించుకొని సోమ వారం రక్తదాన శిబిరాన్ని నిర్వ హించారు. ఇంజినీరింగ్ కళాశాల, ఎస్‌వి డిగ్రీ కళాశాల నుంచి 110 మంది విద్యార్థులు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి వారి రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళు డాక్టర్ ఆర్.వీర సుదర్శన రెడ్డి, ఎస్. సుధాకర్ రెడ్డి రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాలల వైస్ చైర్మన్లు అంబవరం ప్రకాష్, ప్రదీప్ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు బిగించాలి

కడప : జగనన్న కాలనీలలో పూర్తయిన ఇళ్లకు విద్య ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు బిగించి విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్. సుబ్బరాజు ఆదేశించారు. సోమవారం ఆయన తన చాంబర్లో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధికి మానవ వనరులు విలువైనవని, విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఎసిఎ అండర్- 25 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

కడప: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్- 25 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు సోమవారం కెఒఆర్‌ఎం కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. సెంట్రల్ జోన్- సౌత్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 51.5 ఓవర్లలో 164 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఎం. మహీప్ కుమార్ 41, బ్రహ్మ తేజ 36 (నాట్ అవుట్) పరుగులు చేశారు. సౌత్ జోన్ జట్టులోని ఎం ఆంజనేయులు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు, ఎస్.కె. ఇస్మాయిల్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన సౌత్ జోన్ జట్టు 36 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్. ధ్రువ కుమార్ 74, టి. వంశీకృష్ణ 4 0 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ జట్టులోని సందీప్, మహీప్ కుమారులు చెరో వికెట్ తీసుకున్నారు.

వాహనాలకు వేలం

ఒంటిమిట్ట (సిద్ధవటం) : సిద్ధవటంలో ఎస్ఇబి కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టు బడిన వాహనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం వేలంపాట నిర్వహించారు. ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ వేలంపాట వేస్తున్నట్లు ముందుగానే ప్రకటన చేయటంతో వివిధ ప్రదేశాల నుంచి పాల్గొన్న పాటదారులు డిపాజిట్ కట్టి టోకెట్లు తీసుకున్నారు.

ఉద్యోగుల తొలగింపు దారుణం : సిఐటియు

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ విమర్శించారు. సోమవారం పాత బస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక తొలగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అకౌంట్స్ పే ఆఫీసులో 17 మందిని తీసేసినట్లు చేసినట్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. హాజరు వేయకూడదని ఉద్యోగులకు చెప్పారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ, గురుకుల పాఠశాలలు, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను తీసివేశారని చెప్పారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నా ఉద్యోగులను తొలగించాలన్నది సరికాదని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడమే కాకుండా కాంట్రాక్టు వ్యవస్థను తొలగించిందని గుర్తు చేశారు. కేరళలో కనీస వేతనం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తొలగిస్తాం అనే మాట వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల్లో ఏమి జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

అన్నదాత గోవర్ధన్‌రెడ్డి అభినందనీయుడు



గోవర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టరేట్‌కు తమ కష్టాలు చెప్పుకోవటానికి వస్తున్న ప్రజలకు కడుపునిండా అన్న పెడుతూ వారి ఆకలి తీరుస్తున్న సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి అభినందనీయుడని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద గోవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మన్సూర్ అక్బర్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల కాలంలో దాదాపు 6లక్షల మందికి అన్నదానం చేయడం గొప్పవిషయమన్నారు. యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. యువత సమాజానికి సేవచేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి అవార్డులు ప్రదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి నజీర్, జిల్లా కార్యదర్శి అమీర్, నగర బిసి సెల్ అధ్యక్షులు మల్లి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కోశాధికారి రూపనగుడి హుస్సేన్, సద్దాంతి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మొండిచేయి : ఎన్ఎస్‌యుఐ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు

కడప : రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులను ఆదుకోలేని ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు డిమాండ్ చేశారు. సోమ వారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా తెస్తానని ప్రతి సంవత్సరమూ నిరుద్యోగ యువతీ యువకులకు రెండు లక్షల 30 వేలకు పైగా ఉద్యోగాలను ఇచ్చి నిరుద్యోగ యువతీ యువకులను ఆదుకుంటానని చెప్పి ఇవాళ కేవలం 6500 పోస్టులు వదలడం దారుణమని అన్నారు. విభజన హామీలను పూర్తిగా గాలికి వదిలేశారని పేర్కొన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను పది సంవత్సరాల నుంచి శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేని ఘనత టిడిపి, వైసిపి ప్రభుత్వాలది అని అన్నారు. సమావేశంలో నగర్ నాయకులు విజయ్, దినేష్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉపయోగకరం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ పిఒ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

విభిన్న ప్రతి భావంతులు తమ పనులు తాము స్వయంగా చేసుకోవడానికి ఉపకరణాలు దోహదపడతాయని సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని భవిత సెంటర్ ఆవరణంలో విభిన్న ప్రతి భావంతుల విద్యార్థులు ఉచిత వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతి భావంతులైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులు అండగా నిల వాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలకు వారిని క్రమం తప్పక తీసుకురావాలని కోరారు. భవిత కేంద్రాల్లో ఉచిత విద్యతోపాటు ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో 150 మందికి పైగా ఉచిత పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా సర్వజన ఆసుపత్రి నుంచి నిపుణులైన వైద్యులు హాజరయ్యారు. కడప సమీప మండలాల నుంచి విచ్చేసిన విభిన్న ప్రతిభావంతులకు వైకల్య పరీక్షలు నిర్వహించి అవసరమైన పరికరాలను సూచించారు. **ఉచిత పరీక్షలను సద్వినియోగం చేసుకోండి..** జిల్లా లోని విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు అవసరమైన పరికరాలను అం దించడానికి ఉచిత వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. విభిన్న ప్రతి భావంతుల విద్యార్థులకు ఉచిత పరికరాలను అందించేందుకు వైకల్య పరీక్షలు నిర్వహి స్తున్నా్నరని చెప్పారు. 6న బద్వేల; 7న పులివెందుల, 8న ప్రొద్దుటూరులలో నిర్వహి స్తారన్నారు. 18 సంవత్సరాలలోపు విభిన్నప్రతిభావంతుల విద్యార్థులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బిసి గర్జనను విజయవంతం చేయాలి

చెన్నూరు : విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 7న నిర్వహించబోయే జయహో బిసి మహాసభలో బిసి సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విజయలక్ష్మి కోరారు, సోమవారం వారు స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బిసిలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. బిసి సోదరులందరూ ఏకతాటిపై నిలబడి వైసిపి ప్రభుత్వానికి వెన్నెముకగా నిలబడాలని వారు పిలుపునిచ్చారు.

మట్టిని రక్షించండి

కడప : ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్ నీలయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌సిసి కేడెట్లచే మట్టిని రక్షించండి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేడెట్లు ర్యాలీ నిర్వహిస్తూ మట్టిని రక్షించండి అంటూ నినాదాలలు చేశారు. ర్యాలీని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో మట్టికి అత్యంత ప్రాధాన్యత ఉందని, ఈ సృష్టిలో ప్రతి జీవి జీవనం పూర్తిగా మట్టి పైనే ఆధారపడి ఉందని అన్నారు.

ప్రతి గ్రామంలోనూ ఉచిత చికిత్సలు

కాశినాయన : ప్రతి గ్రామంలోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ ప్రశాంతి తెలిపారు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ లో భాగంగా సోమవారం గంగనపల్లెలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో నడవలేని వారికి ఇంటి దగ్గరికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ ఇంకా ఇతర వ్యాధులున్న వారికి ఇంటి దగ్గర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాస్ రెడ్డి సుబ్బరాయుడు 104 సిబ్బంది పాల్గొన్నారు

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన


టూల్ గదుల వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమ డిమాం డ్లను నెరవేర్చాలని 15 రోజులుగా జెఎసి ఆధ్వ ర్యంలో చేస్తున్న ఆం దోళనలో భాగంగా సోమ వారం కాంట్రాక్ట్ కార్మికులు టూల్‌డౌన్ నిరసన చేశారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కర్మాగారంలోని టూల్ గదుల వద్ద విధులకు వెళ్లకుండా శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ తమ గోడును ఆర్‌టిపిపి యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చర్చలకు కూడా పిలవని వారి మొండి వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. జెఎసి నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక నారాయణ పాఠశాల విద్యార్థులకు సోమవారం నాసా ప్రాజెక్ట్ చేసేందుకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సునీతారెడ్డి, నాసా ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి నీలకంఠారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నాసా ప్రాజెక్ట్ పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. ఆ మేరకు నారాయణ పాఠశాల యాజమాన్యం ఈ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తేక్వాండోలో ఎస్‌విడిసి విద్యార్థులకు గోల్డ్ మెడల్స్


విద్యార్థులతో ఎస్‌విడిసి యాజమాన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అజాది అమృత్ మహోత్సవంలో భాగంగా బెంగళూరులో ఓపెన్ నేషనల్ తేక్వాండో ఛాంపియన్ షిప్‌లో ఎస్‌విడిసి విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేక్వాండో మాస్టర్ ఎ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు శిక్షణ పొందరని తెలిపారు. యగ్నేష్, అస్లాం వికాస్, బెనర వరప్రసాద్, రుద్రసేనారెడ్డి గోల్డ్ మెడల్స్ సాధించరన్నారు. ఈ ఛాంపియన్ షిప్‌లో రెండు విభాగాల్లో విద్యార్థులు పోటీ పడగా ప్రతి ఒక్కరు ఒక గోల్డ్ మెడల్‌ను సాధించారన్నారు. కళాశాల ద్వారా ఒక టీంగా వెళ్లగా అందుకు గుర్తుగా ఛాంపియన్ షిప్ మేనేజ్‌మెంట్ కళాశాలకు ఒక ట్రోఫీని బహుమతిగా అందజేసిందన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోయే ప్రయత్నంలో తమ కళాశాల ఎప్పుడూ ముందంజలో ఉంటుందని కళాశాల కో-ఆర్డినేటర్ పి.గౌరీ శంకర్ తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను సిబ్బంది అభినందించారు.

అనుమతి ఎరువులనే కొనుగోలు చేయాలి



రికార్డుల తనిఖీలో ఎడి అశోక్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రభుత్వం అనుమతిచ్చిన ఎరువులను రైతులు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ ఎడి అశోక్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ ప్రతిరోజూ దుకాణదారుడు రేటు పట్టికలను ప్రదర్శించాలన్నారు. కొన్న రసాయనిక వస్తువుకు సంబంధించి రైతులకు తప్పక రసీదు ఇవ్వాలన్నారు. నకిలీ ఎరువులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దుకాణాలపై తనిఖీలు చేస్తామన్నారు.

చల్లా రాజగోపాల్ యాదవ్‌కు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


చల్లాను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేంపల్లె మండలం గోనమాకులపల్లెలోని శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠకు సోమవారం హాజరైన చల్లా రాజగోపాల్ యాదవ్‌ను ఆ ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కృష్ణాలయం కమిటీ ఆహ్వానం మేరకు ఆయన వెళ్లారు. బిసి సంక్షేమ సంఘం తరపున చేస్తున్న అన్నదానం, ఇతర సేవలకు మెచ్చి చల్లాను సన్మానించారు. ఆయన చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, సీతంపల్లె రమణ, ఎం.రామయ్య, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారావ్, చల్లా రవి పాల్గొన్నారు.

బడికి వెళ్లాలంటే అడుసు తొక్కాల్సిందే..!

మురుగు నీరు పోయేందుకు ప్రత్యేక కాలువలు, పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని విన్నపం

ప్రజాశక్తి - కొండాపురం



ఆ ఊరి పిల్లలు బడికి పోవాలంటే మురుగు నీటిలో పోవాల్సిందే. మండల కేంద్రంలోని జడ్‌పి ఉన్నత పాఠశాల గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైంది. అప్పటి నుంచి నేటి వరకు నూతన భవనాలను నిర్మించలేదు. ఈ నేపథ్యంలో ముంపునకు గురైన పాత భవనాల్లోనే విద్యాబోధన సాగుతోంది. ఆ పాఠశాలలో చదివే పిల్లలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, రైల్వే లైనుకు అటు వైపుగా ఉన్న నివాస ప్రాంతాల వారు తమ రాకపోకలను తప్పనిసరిగా రైల్వే వంతెన కింద నుంచి మురుగు నీటిలో వెళ్లాల్సిందే. ఈ వంతెన కింద రామసుబ్బారెడ్డి కాలనీ, శాంతినగర్ కాలనీ, మసీదు, నూతన గ్రామీణ బ్యాంకు పరిసర ప్రాంతాల వారు వదిలే మురుగుతో కూడిన నీరు పారుతూ ఉంటోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు దుర్గంధాన్ని భరిస్తూ, ముక్కు మూసుకుని ఆ మురుగు నీటిలో వెళుతున్నారు. ఈ ఒక్క దారి మాత్రమే ఉంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి వంతెన కింద పారుతున్న మురుగు నీరు పోయేందుకు పైప్‌లైన్, ప్రత్యేక కాలువలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు కోరుతన్నారు.

బిసి మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు


జమ్మలమడుగు రూరల్ : పోస్టర్‌ను విడుదల చేస్తున్న బిసి నాయకులు

ఈనెల 7న విజయవాడలో నిర్వహించనున్న వైసిపి జయహో బిసి మహాసభ పోస్టర్లను సోమవారం ఆ పార్టీ బిసి నాయకులు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. సంబంధించిన పోస్టర్ను జమ్మలమడుగు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోస్టర్లను ఆవిష్కరించామన్నారు. బిసిల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్‌లో, పార్టీలో బిసిలకు పదవులిస్తూ ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రముఖ డాక్టర్ వి.కిరణ్‌కుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, కౌన్సిలర్ గౌరీనాథ్, మాజీ కౌన్సిలర్ బడిగింజల జనార్ధన్, వేణు యాదవ్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ఈ నెల 7న విజయవాడలో జరిగే బిసి జయహో మహాసభ పోస్టర్లను సోమవారం వైసిపి తొండూరు మండల ఇన్‌ఛార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బిసిలకు పెద్దపీట వేశారన్నారు. పులివెందుల పురపాలక చైర్మన్, వడ్డెర సంఘ పులివెందుల అధ్యక్షులు వల్లపు ప్రసాద్ మాట్లాడుతూ మహాసభకు బిసి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, రసూల్, కౌన్సిలర్లు కోడి రమణ, పానపల్లి కిషోర్, రంగనాథ స్వామి గుడి డైరెక్టర్ మాధవాచారి, వాల్మీకి సంఘ డైరెక్టర్ నారాయణస్వామి, కో-ఆప్షన్ చంద్రమౌళి, బిసి నాయకులు పాల్గొన్నారు.

హామీ మేరకు ఉద్యోగాలు భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలన్నారు. అలాగే పరీక్ష తేదీ గడువును కూడా పొడిగించాలన్నారు. ప్రతి సంవత్సరం 6,700 ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఆ ప్రకారం గడచిన ఈ మూడున్నరేళ్లకుగానూ 20,100 ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దేవిడ్ రాజ్, ఎల్లయ్య, నాయకులు మన్సూర్, శివ, హాజీ, బాషా పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల తరలింపును ఆపాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


డిసిఒతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్థానిక గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులను సగిలేరు గురుకుల పాఠశాలకు తరలింపును వెంటనే ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి డిసిఒ సుకన్యకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మఠంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో వరుసగా విద్యార్థులు తెలుగుగంగ కాలువలో గల్లంతై మృతి చెందడంతో విద్యార్థులకు రక్షణ కల్పించకుండా అధికారులు, విద్యార్థులను రాత్రికి రాత్రే సగిలేరు గురుకుల పాఠశాలకు తరలించడం దారుణమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విద్యార్థులను తరలించడం శోచనీయమన్నారు. సగిలేరు గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు అక్కడ ఉండలేక ఇళ్లకు వెళ్లిపోయారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను యతావిధిగా మఠంలోనే కొనసాగించాలని కోరారు. ఇందుకు స్పదించిన డిసిఒ మాట్లాడుతూ మఠంలోనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, అజయ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారి షబానాకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


చిన్నారికి ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ ఖాదరాబాదు గ్రామానికి చెందిన చిన్నారి షబానాకు హామీ మేరకు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. ఈ ఏడాది జులై 26న పాఠశాల మరమ్మతులు నిర్వహిస్తున్న సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల చోటు చేసుకున్న ప్రమాదంలో 13ఏళ్ల షబానా గాయపడిన విషయం విదితమే. ఆ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. షబానా తల్లిదండ్రులకు నేనున్నాననే భరోసా కల్పించి చిన్నారి తల్లితండ్రులకు రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జరిగిన సంఘటన తనను ఎంతగానో కలచివేసిందన్నారు. మానవత కోణంలో ఆలోచించి ఆర్థిక సాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో షబానా తల్లిదండ్రులకు తన చేతనైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఖాదరాబాదు గ్రామ ప్రజలు, రాచమల్లు అభిమానులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం : ఎమ్మెల్యే

వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాజుపాలెం మండలం వెలవలి గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుండి తనపట్ల ప్రజలు ఎనలేని అభిమానాన్ని చూపుతూ వస్తున్నారని పేర్కొన్నారు. తాను అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు అంజనాదేవి, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, ప్రొద్దుటూరు ఎంపిపి శేఖర్ యాదవ్, పార్టీ నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీపై అవగాహన కల్పించాలి

- మున్సిపల్ చైర్మన్ వి.వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ రూ.35 వేల నగదు చెల్లించేలా చూడాలని పాడా కార్యాలయ ప్రత్యేక అధికారి ఆంజనేయులు, పురపాలక చైర్మన్ వరప్రసాద్ సూచించారు. పురపాలిక సభా భవనంలో సోమవారం ఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సూచనలను చేశారు. ప్రతి ఆర్‌పి లబ్ధిదారులతో మొత్తాలను విధిగా కట్టించాలన్నారు. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ జగనన్న కాలనీలో ఇళ్లపై వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు


అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

అల్లాడుపల్లె దేవాలయ ఆవరణలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి నిత్య అన్నదాన సత్రంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు నరేంద్ర, అర్చకులు భరత్ శర్మ, గోవింద్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లాడుపల్లె సర్పంచ్ జి.కిషోర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీపేట సర్పంచు కె.చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఉద్యోగులను నమ్మించి మోసగించిన సిఎం

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ ఉద్యోగులను, విశ్రాంత ఉద్యోగులను, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మించి మోసగించారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలోకి రాక ముందు చెప్పిందొకటి అధికారంలోకి వచ్చాక చేస్తున్నది మరొక్కటని విమర్శించారు. ఏరు దాటిన తర్వాత ఓడ మల్లన్న అనే చందంగా జగన్ పాలన తయారైందని తెలిపారు. ఎన్నికలకు ముందు జగన్ తన మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, సకాలంలో పిఆర్‌సి అమలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం అని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ వాటిని తుంగలో తొక్కినట్లు ఆరోపించారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి మూడున్నరేళ్లయినా అమలు చేయలేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయలేదని తెలిపారు. పిఆర్‌సి మూడేళ్ల ఆలస్యంగా అమలైందని చెప్పారు. ఐఆర్ 27 శాతం కాగా ఫిట్‌మెంట్ 23.29 శాతం మాత్రమే ఇచ్చారని తెలిపారు. జగన్ పాలనలో దాదాపు 50 వేల మందిని ఉద్యోగం నుండి ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. మేనిఫెస్టో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు శోచనీయం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయడం శోచనీయమని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దాదాపీర్ పేర్కొన్నారు. స్థానికంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులను తొలగిస్తామంటూ ప్రభుత్వ జిఒలు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సమయంలో మాత్రం ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పారన్నారు. విలేకరుల సమావేశంలో ఆమ్‌ఆద్మీ నాయకులు రహీం, పీరుబాషా, సలీం పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అర్హులైన యువత తమ ఓటును నమోదు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజినేయులు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటు నమోదు కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఓటు విలువ ప్రజాస్వామ్యంలో అత్యుత్తమమైనదని పేర్కొన్నారు. ఓటు ద్వారా ప్రభుత్వాన్ని పాలించే నాయకులను ఎన్నుకునేందుకు వీలుంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్‌రెడ్డి కళాశాలలో అర్హులైన 70 మంది విద్యార్థులకు ఓటు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, మలేశ్వరమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రాచవీటి తేజేంద్ర, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బిసిలపై వైసిపి కపట ప్రేమ : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న నల్లబోతుల నాగరాజు

రాష్ట్రంలో బిసిలపై వైసిపి ప్రభుత్వం కపట ప్రేమను చూపే ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు తెలిపారు. దీన్ని ఎండగట్టేందుకు టిడిపి రాష్ట్ర బిసి అధ్యక్షులు కొల్లు రవీంద్ర బుధవారం కడప కలెక్టోరేట్ వద్ద నిరసన చేస్తున్నారని తెలిపారు. నిరసనలో పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. బిసిల అణచివేత ధోరణిపై వైసిపి ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో బిసిలంతా ఇదేం కర్మ అని బోరుమంటుంటే.. బిసిలను ఉద్ధరించేశాం అంటూ సభ పెట్టి వారిని మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవడం సిగ్గుచేటన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రోత్సాహమిచ్చి వారికి అండగా నిలిచింది టిడిపినే అని పేర్కొన్నారు. కడప పార్ల మెం టు కార్యదర్శి యమ్మనూరు ఆంజనేయులు, ప్రొద్దుటూరు మండలం ఉపాధ్య క్షులు షరీఫ్, ప్రొద్దుటూరు తెలుగు యువత కార్యదర్శి పల్లా సాయిరాం పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : వైసిపి ప్రభుత్వం బిసిలకు తీవ్ర అన్యాయం చేస్తోందని, వారికి చెందాల్సిన సబ్ ప్లాన్ నిధులను ఇవ్వాలని కోరుతూ.. జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు సోమ వారం రెవెన్యూ కార్యా లయంలో డిటి లక్ష్మీదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 50 శాతంపైగా జనాభా ఉన్న వెనుకబడిన తరగతులకు గత మూడున్నరేళ్లుగా తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సాధికార కార్యదర్శి సంకర నాగేశ్వరరావు, చాంద్‌బాషా, ఓబులేసు పాల్గొన్నారు.


డిటికి వినతిపత్రమిస్తున్న టిడిపి నాయకులు

యువత సేవా మార్గం వైపు పయనించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యువత సేవా మార్గం వైపు పయనించాలని పలువురు వక్తలు సూచించారు. మండలంలోని లింగాపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో సోమవారం వివేకానంద ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ, కాస్ జిల్లా కన్వీనర్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త రాజోలి శ్రీధర్‌రెడ్డి ప్రసంగించారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజం కోసం స్వచ్ఛంద సేవ చేస్తున్న వారిని వారు అభినందించారు. సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి జిల్లాలో ఉత్తమ సేవలు అందిస్తున్న 30 స్వచ్ఛంద సేవా సంస్థలను గుర్తించి వివేకానంద సేవా రత్న పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. అనంతరం యువతకు సేవాంజలి పుస్తకాలను, వివేకానందుని సాహిత్యాన్ని పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాస్‌రెడ్డి, కొల్లం గంగిరెడ్డి, లక్ష్మీప్రసన్నరెడ్డి, సురేష్, బాల నాగిరెడ్డి పాల్గొన్నారు.



సేవా పత్రాలతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కడప.

I.A.NO. 261/ 2019
O.S.NO. 223/ 2019

పి.చంద్రశేఖర్‌రెడ్డి, తండ్రి పి.నాగమల్లారెడ్డి, వయస్సు 43 సం॥లు, హిందుకులం, నివాసం తిప్పిరెడ్డిపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం, కడప, వైఎస్ఆర్ జిల్లా.
...పిటీషనరు/ వాది

వర్సెస్

శ్రీమతి ముప్పాల విజయలక్షుమ్మ, భర్త క్రిష్ణంరాజు, వయస్సు 67సం॥లు, హిందు, గృహిణి, నివాసం డోర్‌నెం.10-A/58, ఫస్ట్‌క్రాస్ హెబ్బేల్, బన్నిమిల్స్‌రోడ్డు, డొండనగర్, బెంగళూరు-32, ప్రస్తుత నివాసం డోర్‌నెం.1/11, నబీకోట, అక్కాయపల్లె, కడప సిటి-3, వైఎస్ఆర్ జిల్లా.
...రెస్పాండెంట్/ ప్రతివాది

రెస్పాండెంట్/ ప్రతివాదికి నోటీసు

పై కనీన వాది పై కోర్టులో పర్మనెంట్ ఇంజక్షన్ కోరుచు పై కనీన రెస్పాండెంట్/ ప్రతివాది పైన సివిల్ వ్యాజ్యం దాఖలు చేసినారు. పై కనీన రెస్పాండెంట్/ ప్రతివాది పై కనీన కోర్టులో హాజరు అగుటకు తేది: 13/12/2022న ఉదయం 10.30 గంటలకు స్వయం గా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షమున తీర్మాణం చేయుదురని ఇందుములకంగా తెలియజేయుచున్నాము.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్.సుధాకర్ బాబ్జీ,
అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కడప.

O.S.NO. 223/ 2019

పి.చంద్రశేఖర్‌రెడ్డి, తండ్రి పి.నాగమల్లారెడ్డి, వయస్సు 43 సం॥లు, హిందుకులం, నివాసం తిప్పిరెడ్డిపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం, కడప, వైఎస్ఆర్ జిల్లా.
...వాది

వర్సెస్

శ్రీమతి ముప్పాల విజయలక్షుమ్మ, భర్త క్రిష్ణంరాజు, వయస్సు 67సం॥లు, హిందు, గృహిణి, నివాసం డోర్‌నెం.10-A/58, ఫస్ట్‌క్రాస్ హెబ్బేల్, బన్నిమిల్స్‌రోడ్డు, డొండనగర్, బెంగళూరు-32, ప్రస్తుత నివాసం డోర్‌నెం.1/11, నబీకోట, అక్కాయపల్లె, కడప సిటి-3, వైఎస్ఆర్ జిల్లా.
...ప్రతివాది

ప్రతివాదికి

పై కనీన వాది పై కోర్టులో పర్మనెంట్ ఇంజక్షన్ కోరుచు పై కనీన ప్రతివాది పైన సివిల్ వ్యాజ్యం దాఖలు చేసినారు. పై కనీన ప్రతివాది పై కనీన కోర్టులో హాజరు అగుటకు తేది: 13/12/2022న ఉదయం 10.30 గంటలకు స్వయం గా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షమున తీర్మాణం చేయుదురని ఇందుములకంగా తెలియజేయుచున్నాము.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్.సుధాకర్ బాబ్జీ,
అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కడప.

O.S.NO. 139/ 2018

శ్రీమతి మచ్చ కమలమ్మ, భర్త గోవిందు, వయస్సు 58 సం॥లు, హిందు కులం, డోరునెం.7/177-బి, ఎన్జీఓ కాలనీ, H/o చిన్నచౌకు, కడప.
...వాది

వర్సెస్

సోమ నాగమల్లన్న, తండ్రి సోమ సుబ్బయ్య, వయస్సు 66 సం॥లు, హిందుకులం, డోర్‌నెం. 25/435, వసంతపేట, ప్రొద్దుటూరు టౌను, కడప జిల్లా.
...ప్రతివాది నెం.2

2వ ప్రతివాదికి సమను

పై కనీన వాది పై కనీన కోర్టులో 2వ ప్రతివాది మరియు ఇతరుల పైన పై కనీన కేసులోని షెడ్యులు ఆస్థిపై తనకు హక్కులు స్థిరపరచమని, మరియు సదరు ఆస్థిలో దౌర్జన్యంగా కట్టిన కట్టడాలను తీసువేయమని కోరుతూ పై సివిల్ వ్యాజ్యం దాఖలు చేయడం జరిగినది. పై కనీన 2వ ప్రతివాదికి పై కనీన కేసులో హాజరు అగుటకు తేది : 20.12.2022న ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరు కాని పక్షంలో మీ పరోక్షమున కోర్టు వారు తీర్మాణం చేయుదురని ఇందుములకంగా తెలియజేయుచున్నాము.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్.సుధాకర్ బాబ్జీ,
అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ ప్రధాన జిల్లా జడ్జి గారి కోర్టులో : కడప.

I.A.NO. 1114/ 2022
A.S.NO. /2022

O.S.NO. 125/2021 ఆఫ్ రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కడప.

గోపిరెడ్డి వెంకటరమణారెడ్డి, తండ్రి జి.దేవదాసురెడ్డి, వయస్సు 59 సం॥లు, ప్రభుత్వ ఉద్యోగి, హిందుకులం, నివాసం, డోర్‌నెం.1/431, మారుతినగర్, కడప.
...పిటీషనరు/అప్పీలెంట్

వర్సెస్

1. షేక్ మౌళాలి, తండ్రి షేక్ అబ్దుల్ సయద్, వయస్సు 40 సం॥లు, ముస్లిం కులం, వ్యాపారం వలన జీవనం.
2. షేక్ షంషద్ బేగం, వయస్సు 42సం॥లు, ముస్లిం కులం, ఇరువురి నివాసం: డోర్‌నెం.100/229, విశ్వనాథపురం, ఊటుకూరు పంచాయతి, సికెదిన్నె మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.
...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్

రెస్పాండెంట్స్‌కు నోటీసు

పై కనీన పిటిషనరు/ అప్పీలెంట్ రాజశ్రీ 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కడప వారి కోర్టులోని O.S.NO. 125/2021 లోని డిక్రీ మరియు జడ్జిమెంట్ తేది: 01.04.2022 ఇచ్చిన తీర్పును రద్దు పరచి డిక్రీ ఇవ్వవలసినదిగా పై అప్పీలును దాఖలు చేసినారు. సదరు అప్పీలు దాఖల చేయడంలో 13 దినములు ఆలస్యంను మన్నించి అప్పీలు స్వీకరించవలసినదిగా కోరినారు. కావున పై కనీన రెస్పాండెంట్స్‌కు 13 దినముల గడువుపై ఏదైన అభ్యంతరములు వున్నచో పై కనీన కోర్టులో 15.12.2022న ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. మీరు రాని పక్షంలో పై కనీన పిటిషన్ పై మీ పరోక్షమున తీర్మాణం చేయుదురని తెలియజేడయమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎం.సుధాకర్‌బాబ్జీ
అడ్వకేటు, కడప.